

దాతల సాయం గొప్పది



విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

చింతకొమ్మదిన్నె: దాతల సహాయం మరువలేనిదని మండల విద్యాశాఖ అధికారి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సహాయ ఫౌండేషన్ సభ్యుల ద్వారా మండలంలోని దాదాపు 20 పాఠశాలలకు రూ.50 వేల విలువచేసే 850 నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసు లోనే యువకులు సభ్యులుగా ఏర్పడి సహాయ ఫౌండేషన్ ద్వారా మండలంలోని 4, 5 తరగతుల విద్యార్థులకు 850 నోట్ బుక్స్ ఇవ్వడం గొప్ప విషయని పేర్కొన్నారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం సహాయ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దీనదయాల్, ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, రామాంజనేయరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్స్ భర్తీలో నిబంధనలు అమలయ్యేనా?

రేపటి నుంచి 313 పోస్టులకు కౌన్సెలింగ్
ముందస్తు ప్రకటన విడుదలలో వైఫల్యం
గైడ్‌లైన్స్ అమలులో చిత్తశుద్ధి కరువు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ కార్యాలయం స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేయడంలో నిబంధనల్ని అమలు చేసే పరిస్థితి లేదని తెలుస్తోంది. ప్రభుత్వం తాజాగా 313 స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆర్‌డి కార్యాలయం స్టాఫ్‌నర్స్ పోస్టుల రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి వారం రోజుల ముందుగా పోస్టుల భర్తీ ప్రకటన విడుదల చేయడం మొదలుకుని ఖాళీల వివరాలతో కూడిన ప్రకటనను విడుదల చేయాల్సి ఉంది. అనంతరం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేయాల్సి ఉంటుంది. వివరాల మెరిట్ మార్కుల ఆధారంగా పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఇటువంటి నిబంధనల్ని వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ కార్యాలయం విస్మరించిందనే ఆరోపణలు ముప్పిరిగొనడం విస్మయాన్ని కలిగిస్తోంది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రీజియన్ పరిధిలో స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఊపందుకుంది. ఈ నెల 21, 22వ తేదీల్లో 313 స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీ సందర్భంగా 11,120 దరఖాస్తులు చేసుకున్న సంగతి సంగతి తెలిసిందే. 291 స్టాఫ్‌నర్స్ పోస్టులను భర్తీ చేసిన సంగతి తెలిసిందే. తాజా స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ చేయనున్న సందర్భంగా అప్పటి దరఖాస్తుల్లో మెరిట్ ఆధారంగా భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీ సందర్భంగా పదుల సంఖ్యలో బోగస్ సర్టిఫికెట్లు వెలుగు చూసిన సంగతి తెలిసిందే. తాజా స్టాఫ్‌నర్స్ పోస్టుల రిక్రూట్‌మెంట్ సందర్భంగా వేల సంఖ్యలో ఉన్న దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలన చేయాల్సిన అవసరం ఉంటుంది. స్టాఫ్‌నర్స్ పోస్టుల రిక్రూట్‌మెంట్ ప్రకటన కనీసం వారం రోజుల ముందుగా విడుదల చేయాల్సి ఉన్నట్లు సమాచారం. ఇటువంటి నిబంధనల ఆధారంగా ఆర్‌డి కార్యాలయం పరిధిలోని ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన వేలాది మంది నిరుద్యోగులు కౌన్సెలింగ్ ఉందనే విషయం తెలిసే అవకాశం ఉండదు. అర్హులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అవకాశం ఉండదు. కౌన్సెలింగ్ సమాచారం తెలుసుకున్న నిరుద్యోగులు సకాలంలో కౌన్సెలింగ్‌కు చేరుకునేందుకు అవకాశం ఉండదనే వాదన వినిపిస్తోంది. కౌన్సెలింగ్‌కు 24 గంటల ముందు ఖాళీల ప్రకటన జాబితాను విడుదల చేయాలి. దరఖాస్తుదారులు తమకు గల ఉద్యోగ అవకాశాలను పరిశీలించుకునే అవకాశం ఉంటుంది. ఇటు వంటి నిబంధనల్ని గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా రిక్రూట్‌మెంట్ చేయడంపై ఉద్యోగ సంఘాలు, ఉద్యోగార్థుల నుంచి విమర్శల వర్షం కురుస్తోంది.

'చేనేత'కు చేయూత కరువు

జిఎస్‌టి భారం తగ్గింపులో కేంద్రం చిన్నచూపు
ఆందోళనలో చేనేత కార్మికులు

ప్రజాశక్తి-యంత్రాంగం

రెక్కాడితే డొక్కాడని చేనేతన్నకు కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువస్తున్న పన్నుపోటు భారంగా మారింది. నిత్య సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న చేనేత రంగంపై 5 శాతం జిఎస్‌టి భారం తీవ్ర ప్రభావం చూపుతోంది. కేంద్రంలోని బిజెపి సర్కారు అధికారం చేపట్టిన నాటి నుంచి చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తూవస్తోందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2017 నుంచి 5 శాతం జిఎస్‌టిని చేనేతపై విధించింది. నాటి నుంచి జిఎస్‌టి తొలగించాలని చేనేత కార్మికులు, సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. చేనేత రంగంపై కేంద్ర ప్రభుత్వం మరోసారి దొంగదెబ్బ కొట్టింది. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) నుంచి చేనేత రంగానికి సంబంధించిన పట్టు, నూలు, రంగులను జిఎస్‌టి నుంచి మినహాయించి కార్మికులను ఆదుకోవాలని పదేపదే ఆందోళనలు, విజ్ఞప్తులు చేస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెడచెవిన పెడుతూవస్తోంది. చేనేతను ఇంత నిర్లక్ష్యం చేసిన మోడీ సర్కార్ ఇప్పుడు గుజరాత్ వ్యాపారులు అడిగిందే తడవుగా సూరత్ జరీపై జిఎస్‌టిని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. దీనిపై చేనేత కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కేంద్రం ఇప్పటికైనా వివక్ష పూరిత విధానాలు మార్చుకోవాలని, లేదంటే మూల్యం చెల్లించకతప్పదని కార్మికులు హెచ్చరిస్తున్నారు. చేనేతకు సంబంధించిన పట్టు, నూలు, రంగులపై జిఎస్‌టిని పూర్తిగా ఎత్తివేయాలని పలురువు కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

చేనేతలపై భారం తగ్గించాలి



మోడీ సర్కార్ ఆది నుంచి కార్పొరేట్లకు కొమ్ముకాస్తోంది. చాలా సంవత్సరాలుగా పట్టుపై జిఎస్‌టిని మినహాయించాలని డిమాండు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. కేంద్రం కేవలం గుజరాత్ జరీ పరిశ్రమ రక్షణ కోసం జిఎస్‌టిని 12 శాతం నుంచి ఏకంగా 5 శాతానికి తగ్గించింది. కేంద్రం ఇప్పటికైనా వివక్ష పూరిత విధానాలు మార్చుకోవాలి. చేనేతలకు భారం తగ్గించాలి.

- గంజి మధు, చేనేత కార్మికుడు, బద్వేలు.

నిర్లక్ష్యానికి గురిచేయడం తగదు



ప్రభుత్వం చేనేత పరిశ్రమను నిర్లక్ష్యానికి గురిచేసే ప్రయత్నాలు మానుకోవాలి. జిఎస్‌టి నుంచి చేనేత రంగానికి సంబంధించిన పట్టు, నూలు, రంగులను మినహాయించి కార్మికులను ఆదుకోవాలి. జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలి.

- ఎం.వెంకటేశ్వర్లు, చేనేత కార్మికుడు, మైదుకూరు.

చేనేతపై జిఎస్‌టిని తొలగించాలి



చేనేతపై 5 శాతంగా ఉన్న జిఎస్‌టిని రద్దు చేయాలి. జిఎస్‌టిని తొలగించాలని చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. చేనేతకు సంబంధించిన పట్టు, నూలు, రంగులపై జిఎస్‌టిని పూర్తిగా ఎత్తివేయాలి. చేనేత మగ్గంపై తయారు చేసే బట్టలకు, మిల్లులలో తయారు చేసే బట్టలకు చాలా వ్యత్యాసం ఉందని ప్రభుత్వం గమనించి చేనేత కార్మికుల కష్టాలను గుర్తించాలి.

- పి.రమేష్ బాబు, చేనేత కార్మికుడు, మైదుకూరు.

కార్మికుల కడుపు కొట్టొద్దు



కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై వేంటనే జిఎస్‌టినిఇ తగ్గించాలి. గుజరాత్‌లో వస్త్రాలపై జిఎస్‌టి తగ్గించి ఇతర ప్రాంతాల్లో చేనేత కార్మికులనేసే వస్త్రాలకు జిఎస్‌టి తగ్గించకుండా కడుపు కొట్టడం దుర్మార్గమైన చర్య. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి 2017లో జిఎస్‌టి తగ్గిస్తామంటూ మాటలు చెప్పి తగ్గించకుండా చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తోంది.

- కె.శాంతమ్మ, చేనేత కార్మికురాలు, రాయచోటి.

జిఎస్‌టి భారంగా ఉంది



చేనేత రంగంలో కార్పొరేట్ రంగ జోక్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నివారించాలి. చేనేతపై జిఎస్‌టి ఎత్తివేసి చేనేత కార్మికులను ఆదుకోవాలి. సామాన్యుల చేనేత కార్మికులపై జిఎస్‌టి అనే ఒక పెనుభూతాన్ని మోపడం కేంద్ర ప్రభుత్వానికి తగదు. చిన్నచిన్న చేనేత కార్మికులు పూట గడవడం కోసం కులవృత్తిని ఎంచుకొని జీవనం సాగిస్తున్నారు.

- బొమ్మిశెట్టి జయచంద్ర, చేనేత కార్మికుడు, వల్లూరు.

పన్నులు ఎత్తేసి న్యాయం చేయాలి



చేనేతలపై కేంద్రం విధించే పన్నులను ఎత్తేసి న్యాయం చేయాలి. పవర్ లూమ్స్, హ్యాండ్ లూమ్స్ వేర్వేరు వాటిని ఒకేలా చూపడం వలన



నష్టపోతున్నాం. చేనేతలతో విచారణ జరిపి న్యాయం చేయాలి.

- సంజీవ రాయుడు, చేనేత కార్మికుడు, మైలవరం.

చేనేతలను మోసగిస్తున్న కేంద్రం



ప్రజల మాన ప్రాణాలను కాపాడేవి దుస్తులు. అలాంటి దుస్తులను నేసే మాపై కేంద్ర ప్రభుత్వం అనేక రకాల పన్నులతో నిలువునా మోసం చేయడం తగదు. ప్రభుత్వాలు పన్నులను తగ్గించి, మా ప్రాణాలు కాపాడేలా నిర్ణయాలు తీసుకోవాలి.

- ముని కుమార్, చేనేత కార్మికుడు, జమ్మలమడుగు.

చేనేతలపై కేంద్రం దొంగ ప్రేమ



చేనేతలపై కేంద్ర ప్రేమ చూపిస్తూ కార్పొరేట్ల కొమ్ము కాస్తుందని అన్నారు చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు నూలు,పట్టు రంగులపై జిఎస్‌టిని పూర్తిగా ఎత్తేసి చేనేతను ఆదుకోవాలని కోరారు

- కనకరాజు, చేనేత కార్మికుడు, ప్రొద్దుటూరు.

పట్టు, నూలుపై జిఎస్‌టి తగ్గించాలి



చేనేత రంగంపై ఉన్న ఐదు శాతం జిఎస్‌టిని తగ్గించాలి. చేనేతల కోరుకున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి చేనేత కడుపు కొడుతోంది. చేసిన పనికి సరైన కూలి దొరకక చేనేతలు కుటుంబాలు పస్తులు ఉండాల్సి వస్తుస్తోంది.

- వెంకట రాముడు, చేనేత కార్మికుడు, ప్రొద్దుటూరు.



మహాసభలో మాట్లాడుతున్న మనోహర్

సిఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి-జమ్మలమడుగు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు పట్టణ మహాసభలు స్థానిక డివిజన్ కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. తొలుత స్థానిక నాయకులు దాసు జెండా ఆవిష్కరించారు. మహాసభలకు అంగన్వాడీ యూనియన్ పట్టణ కార్యదర్శి భాగ్యమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు రూ.26 వేలు, మున్సిపల్ వర్కర్స్ రూ.16 వేలు, విఆర్ఎలకు తెలంగాణ కంటే రూ.వెయ్యి ఎక్కువ పెంచుతానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను ఇంత వరకు అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు విజయకుమార్, నాయకులు దాసరి విజయ్, దాసు, కార్మికులు పాల్గొన్నారు. అనంతరం నూతన సిఐటియు కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ సిఐటియు కార్యదర్శిగా దాసరి విజయ్, అధ్యక్షులుగా దాసన్న, ట్రెజరర్‌గా భాగ్యమ్మ, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా వినయ్, లక్ష్మీదేవి, ప్రసాద్‌రెడ్డి, ఆదాము, శేఖర్ నాగన్న, కో-ఆప్షన్ సభ్యులుగా శివన్నారాయణ, సభ్యులుగా నరేంద్ర, దస్తగిరి, రాజు, దివాకర్, జ్యోతి, రవి, అబ్రహం,గంగాధర్, కమల్ భాష, హుస్సేన్ వల్లి, నాగన్నలను ఎన్నుకున్నారు.

అవార్డులను ఆమోదించే అధికారం ఉంది

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.అన్నపూర్ణ

ప్రజాశక్తి-కడప

శాశ్వత లోక్ అదాలత్ పార్టీల మధ్య వివాదంలో ఉన్న విషయాన్ని సామరస్యపూర్వక పరిష్కారం ద్వారా లేదా అర్హతల ఆధారంగా పరిష్కరిస్తామని, పార్టీలు సెటిల్‌మెంట్‌కు రాకుంటే మెరిట్‌ల ఆధారంగా అవార్డులను ఆమోదించడానికి శాశ్వత లోక్ అదాలత్‌లకు న్యాయనిర్ణేత అధికారం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.అన్నపూర్ణ అన్నారు. బుధవారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో ప్రజాప్రయోజిత, న్యాయ సేవలపై న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవలైన రవాణా సేవలు, పోస్టల్ టెలిఫోన్ సేవలు, విద్యుత్ సరఫరా కాంతి లేదా నీరు సేవలు, ప్రజా సంరక్షణ లేదా పారిశుద్ధ్యం, ఆసుపత్రిలో సేవలు డిస్పెన్సరీ, బీమా సేవ,బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సంస్థలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యా లేదా విద్యాసంస్థలు, హౌసింగ్, రియల్ ఎస్టేట్ సేవలు గురించి వివరించారు. ఈ లోక్ అదాలత్‌లు సంబంధిత జిల్లా ప్రధాన కార్యాలయంలో న్యాయసేవాసదన్ భవన సముదాయాలలో పనిచేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కడప శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవలు చైర్మన్ స్వర్ణ ప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ ఎస్.కవిత, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి.రాఘవరెడ్డి, లోక్ అదాలత్ మెంబర్స్, న్యాయవాదులు పాల్గొన్నారు.

జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిని కలిసిన పాస్టర్లు

ప్రజాశక్తి-కడప

ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రెవరెండ్ మల్లెం విజయభాస్కర్, బిషప్ కె.శామ్యూల్ బాబు, పాస్టర్ సుధీర్ పాస్టర్ అమర్ బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి షేక్ ఇమ్రాన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జులై 27న రహమతీయ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న జిల్లా స్థాయి క్రైస్తవ పాస్టర్ల సదస్సుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లెం విజయ భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా క్రైస్తవ పాస్టర్లకు హానరోరియం రెండవ విడత అందించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

దళితుల భూములు లాక్కోవడం రాజ్యాంగ విరుద్ధం

- సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి-గోపవరం

మండలంలోని మడకలవారిపల్లె దళితులకు చెందిన జడ్‌హెచ్‌డిసి భూములను ప్రభుత్వం లాక్కోవడం రాజ్యాంగ విరుద్ధమని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం దళితుల భూములను సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు పరిశీలించారు. బాధితులతో మాట్లాడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1972లో ఇచ్చిన భూములు, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, దళితుల నుంచి ఎన్ఒసి తీసుకోకుండా, నష్టపరిహారం చెల్లించకుండా, ప్రత్యామ్నాయ భూములు చూపించకుండా ఏకపక్షంగా ప్రభుత్వం దళితుల భూములు రద్దుచేసి స్వాధీనపరుచుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. బాధితు లతో, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సమక్షంలో, అఖిలపక్ష పార్టీల నాయకులను చర్చలకు పిలవాలని డి మాండ్ చేశారు. లేకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం బద్వేల్ పట్టణ కార్యదర్శి కె.శ్రీనివాసులు, బిసి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రమణ, ఆవాజ్



నిరసన తెలుపుతున్న నాయకులు

జిల్లా అధ్యక్షులు పి.చాంద్‌బాషా, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని, వ్య.కా.స జిల్లా ఉపాధ్యక్షులు డి.వెంకటేష్, మహిళా సంఘం నాయకులు రత్నమ్మ, సావిత్రి, అనంతమ్మ, వృత్తిదారుల సంఘం నాయకులు రమణ, సిఐటియు నాయకులు నాగేంద్రబాబు, ఆవాజ్ బద్వేల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, అన్వర్ పాల్గొన్నారు.

భూములు జగనన్న స్మార్ట్ సిటీకి కేటాయించొద్దు

కడప అర్బన్: మడకవారిపల్లెకు చెందిన దళితులకు చెందిన జడ్‌హెచ్‌డిసి కింద ఇచ్చిన 60 ఎకరాలను జగనన్న స్మార్ట్ సిటీకి ప్రభుత్వం కేటాయించడం సరైనది కాదని భూ పోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ తెలిపారు. బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జడ్‌హెచ్‌డిసి భూములు ఉమ్మడి జిల్లాలో 15 మండలాలలో ఐదువేల ఎకరాలు దళితులకు 40 ఏళ్ల క్రితం కేటాయించినారని పేర్కొన్నారు. వారి భూములకు అభివృద్ధికి నిధులు కేటాయించలేదని తెలిపారు. వారే సొంతంగా భూములను సాగులోకి తెచ్చుకోవడం, పంటలు సాగు చేస్తున్న పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. ప్రభుత్వం డికెటి భూములకు సన్నకారు, చిన్న కారు రైతులకు ఇస్తున్నట్లు రైతు భరోసా పంట నష్టపరిహారం, ఇతర సబ్సిడీలు, ఇన్సూరెన్స్ సౌకర్యం లాంటి హక్కులు కల్పించకపోవడం వల్ల దళిత రైతులు ప్రతి సంవత్సరం పంటలు సకాలంలో పండక పోవడం వల్ల నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. లేనియెడల దళితుల పక్షాన భూ పోరాట సాధన కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం ఇతర దళిత, గిరిజన, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

341 పరుగులకు చిత్తూరు ఆలౌట్

ప్రజాశక్తి-కడప



లోహిత్ లక్ష్మి నారాయణ



ప్రదీప్‌రెడ్డి

లోహిత్ లక్ష్మి నారాయణ సెంచరీ చేయడంతో చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 341 పరుగుల భారీ స్కోరు సాధించింది. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్-19 మల్టీడే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన చిత్తూరు జట్టు 78.3 ఓవర్లలో 341 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 143 బంతులను ఎదుర్కొని 22 ఫోండరీలు, 4 సిక్సర్ల సహాయంతో 143 పరుగులు (సెంచరీ) చేశాడు. మహమ్మద్ ఇర్ఫాన్ 47 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని షాహుల్ హమీద్ 4, చిన్న బాబు 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 29 పరుగులు చేసింది.

హోరాహోరీగా కర్నూలు, అనంతపురం జట్ల మ్యాచ్

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో కర్నూలు అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ హోరాహోరీగా సాగుతుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 57.1 ఓవర్లలో 175 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సాయి సూర్య తేజ రెడ్డి 53, మనోజ్ రాజ్ 40 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని టీ. ప్రదీప్ రెడ్డి బౌలింగ్లో అద్భుతంగా రానించాడు. 18 ఓవర్లు వేసి అందులో నాలుగు ఓవర్లు మేడిన్ చేసి 59 పరుగులు ఇచ్చి 6 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 32.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. ఆ జట్టులోని వీరారెడ్డి 36, కరీం బాబు 32 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని భార్గవ్ చంద్ర 2 వికెట్లు తీసుకున్నాడు.

ఫ్యాప్టో జిల్లా కోశాధికారిగా వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా ట్రెజరర్‌గా ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న వై.వెంకటసుబ్బయ్య ఎన్నికయ్యారు. మంగళవారం కడప పట్టణంలోని యుటిఎఫ్ భవన్‌లో ఫ్యాప్టో చైర్మన్ మాదన విజయ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో వెంకటసుబ్బయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫ్యాప్టో జిల్లా ట్రెజరర్‌గా ఎన్నికైన వెంకట సుబ్బయ్య సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేస్తున్నారు. ఎస్టీయూలో వివిధ హోదాలో బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ తన పట్ల నమ్మకంతో జిల్లా ట్రెజరర్‌గా ఎన్నుకున్న ఫ్యాప్టో భాగస్వామ్య పక్ష ఉపాధ్యాయ సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. విద్యారంగం పట్ల, ఉపాధ్యాయుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడతామన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఐక్య ఉద్యమాలు చేపడతామన్నారు.

'ఇండియా' ఏర్పాటు శుభపరిణామం

ప్రజాశక్తి - కడప

దేశంలో అరాచక పాలన సాగిస్తున్న ఎన్‌డిఎ కూటమికి వ్యతిరేకంగా 26 ప్రతిపక్ష పార్టీలు కలిసి ఏర్పాటుచేసిన 'భారత జాతీయ అభివృద్ధి సమ్మిళిత కూటమి (ఇండియా) భారతదేశానికి, దేశ అభివృద్ధికి శుభ పరిణామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని యూత్ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9 ఏళ్ల ఎన్‌డిఎ ప్రభుత్వంతో దేశంలోని యువత, రైతులు, సామాన్య ప్రజలు, చిన్నపాటి వ్యాపారస్తులు విసిగి వేసారి ఇబ్బందుల పాలయ్యారన్నారు. సమావేశంలో అడ్వకేట్ భవన ఏకాదశిరెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రొద్దుటూరు అసెంబ్లీ అధ్యక్షుడు వంశీ యాదవ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి జీవన్ కుమార్ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల టౌన్ : ఎన్‌డిఎకు వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా కూటమిని చూసి ప్రధాని ఓర్వలేక, ప్రతిపక్ష పార్టీలన్నీ అవినీతిపరులని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధి అన్వర్ పేర్కొన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ పాలనలో భారతదేశం 50 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బుడిగి శ్రీను, మహబూబ్ బాషా, యువజన కాంగ్రెస్ నాయకులు సలీం, ముజాహిద్ పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ యూత్ స్టడీ హాలను ప్రారంభిస్తున్న సూర్యసాయిప్రవీణ్‌చంద్

యూత్ స్టడీ హాల్‌ను ప్రారంభించిన కమిషనర్

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప ప్రాంతంలోని నిరుద్యోగ, మధ్య తరగతి యువతీ యువకులకు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అనేక మంది చదువు కోవడానికి మహాత్మా గాంధీ యూత్ స్టడీ హాల్ ఎంతో ఉపయోగ పడుతుందని నగరపాలక సంస్థ కమీషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ అన్నారు. బుధవారం బాలాజీ నగర్‌లో యూత్ హాస్టల్‌లో మహాత్మా గాంధీ యూత్ స్టడీ హాల్‌ను కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్టడీ హాల్‌ను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రత్యేక కేబిన్‌లతో పాటు ఫ్రీ వైఫై, అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన బుక్స్, తాగునీటి సదుపాయాలు నామ మాత్రపు ఫీజుతో అందజేస్తున్నామని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి, యూత్ హాస్టల్ మేనేజర్ కె.మణికంఠ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ శ్రీనివాసులరెడ్డి, యువతీ యువకులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలి

- నేర సమీక్ష సమావేశంలో ఎస్‌పి అన్బురాజన్

ప్రజాశక్తి-కడప అర్బన్

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌పి అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అతి తీవ్రమైన నేరాలలో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాల్లో వాహన దారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు, రాబరీ, డకాయిట్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. పోక్సో, మహిళలపై జరిగిన నేరాలపై నిర్ణీత సమయంలో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసుల్లో సమగ్ర విచారణ జరిపి అదృశ్యమైన వారి ఆచూకీ త్వరగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు నిఘా పెంచాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని పేర్కొన్నారు. దేశీ అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణాపై దాడులను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎస్‌హెచ్ఆర్‌సి, ఎన్‌హెచ్ఆర్‌సి ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నేర సమీక్ష సమావేశంలో అదనపు ఎస్‌పి(అడ్మిన్) తుషార్ డూడి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి ప్రవీణ్ కుమార్, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎస్ఎస్ఎస్ వి.కృష్ణారావు, జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి అన్బురాజన్

చెత్త రహిత మున్సిపాల్టీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు నగర పంచాయతీని చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం అంబాభవాని దేవాలయం వద్ద ఆయన పూజ చేసి, ఆరు ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని 17,18 వార్డు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సంకల్ప క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా జమ్మలమడుగు మున్సిపాలిటీకి ఆరు నూతన ఎలక్ట్రికల్ ఆటోలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను కూడా వాలంటీర్ల సాయంతో అందిస్తున్నామన్నారు. 17,18వ వార్డులో ఇంటి స్థలాలు మంజూరు కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. 16వ వార్డులో కొన్ని వీధుల్లో తాగునీటి సమస్య ఉందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్ పోరెడ్డి రామలక్ష్మ, రెండవ వైస్ చైర్మన్ మంగదొడ్డ సింగరయ్య, 17వ వార్డు కౌన్సిలర్ బేపారి నూరున్నిసా, 18వ వార్డు కౌన్సిలర్ గౌరీనాథ్, హస్తకళల చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి, పరిశ్రమల డైరెక్టర్ మార్బుల్ శ్రీను, వైసిపి నాయకులు షామీర్ అలీ, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.


ఆటోలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

'వైఎస్ఆర్ కాపు నేస్తం'కు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ కాపు నేస్తం పథకానికి అర్హులైన కాపు, బలిజ, తెలగ, ఒంటరి సామాజిక మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని రాయలసీమ కాపునాడు యువజన సంఘం అధ్యక్షుడు కావలి కృష్ణతేజ కోరారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ఆర్ కాపు నేస్తం ద్వారా ఎడాదికి రూ.15వేలు బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా కాపు నేస్తం ఇస్తున్నారన్నారు. 45ఏళ్ల నుండి 60 ఏళ్ల లోపు ఉన్న మహిళలు దర ఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. నెలవారీ ఆదాయం పట్టణాల్లో రూ.12 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికి రూ.10 వేలు ఉండాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షన్ తీసుకొనే వారు, ఆదాయపు పన్ను కట్టేవారు అనర్హులన్నారు. ఈనెల 22లోపు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

శ్రావణ మాసోత్సవాలు వైభవంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

గండిక్షేత్రం వీరాంజనేయస్వామి దేవస్థానంలో శ్రావణ మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని పులివెందుల పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గండిక్షేత్రం వీరాంజ నేయ స్వామి దేవస్థాన కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఒఎస్‌డి మాట్లాడుతూ ఉత్సవాల్లో నిర్వహించవలసిన విధుల గురించి ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. పులివెందుల ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్, ఆలయ కార్యనిర్వహణాధికారి అలవలపాటి ముకుందారెడ్డి, పాలక మండలి సభ్యులు, ప్రధాన ఉప ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజాస్వామి, తహశీల్దార్ రాజసింహ నరేంద్ర, ఎంపిడిఒ శివారెడ్డి, మెడికల్ ఆఫీసర్ వాణి, ఎస్ఐ రంగారావు, ఎడిఇలు శ్రీకాంత్, రమేష్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ విజయ భాస్కర్, ఫైర్ ఆఫీసర్ కొండారెడ్డి, ఎపిజిబి మేనేజర్ అశోక్, వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, చక్రాయపేట ఎంపిపి మాధవీ బాలకృష్ణ, ఎంపిటిసి శాంతమ్మ, విఆర్‌ఒలు, పంచాయితీ సెక్రటరీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలో రైల్వేస్టేషన్ రోడ్డు దారిలో ప్రభుత్వ అధికారులు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. ఆ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ పట్టణంలో నాగులకట్ట నుండి రైల్వేస్టేషన్ వెళ్లే దారిలో వీధి దీపాల్లేక రాత్రి సమయాల్లో స్థానికులతోపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జమ్మలమడుగు నుండి విజయవాడ, తిరుపతి, కడపకు రాత్రి, తెల్లవారుజామున రైళ్లు నడుస్తున్నాయన్నారు. చిమ్మ చీకటిలో ప్రయాణికులు వెళ్ళాలంటే భయాందోళనలకు గురవుతున్నారన్నారు. పోలీసు వారు కూడా రైళ్ల రాకపోకల సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులు శివ, ఉదయ్, సాంబశివ, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజల సహకారంతో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, వాటిని వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని 12వ వార్డులో బుధవారం రూ.35లక్షలతో రోడ్డు డ్రయినేజి కాలువ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనంతగా పట్టణం అభివృది చెందుతోందన్నారు. సుందర ప్రొద్దుటూరుగా తయారు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గురువారం మంత్రుల చేతుల మీదుగా రూ.150కోట్లతో ప్రజాప్రయోజన పనులు ప్రారంభించబోతున్నామని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాజామోహిద్దీన్ మాట్లాడుతూ తన వార్డులో అభివృద్ధి పనులు చేపట్టినందుకు ఎమ్మెల్యే, పాలకమండలికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పి.బంగారెడ్డి, కౌన్సిలర్లు కమాల్‌బాషా, వడ్ల ఇబ్రహీం ఖలీలుల్లా, కో-ఆప్షన్ సభ్యుడు మల్లికార్జున్ యాదవ్, డిఇదస్తగిరి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు

ముస్లిం సమాజానికి తోడుగా ఉంటా

ప్రొద్దుటూరు : ముస్లిం సమాజానికి తోడుగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి ఒకడుగు ముందే ఉంటానని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్ తెలిపారు. స్థానిక విలేకరులతో ముక్తియార్ బుధవారం రాత్రి ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ జాతీయ కార్యాలయంలో బుధవారం ముస్లిం మైనార్టీ టిడిపి నాయకులు రాష్ట్రానికి చెందిన ముస్లిం మతపెద్దలు, మౌళీలు, ఖాజీలు, ముఫ్తిలతో సమావేశమైనట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న యూనిఫాం సివిల్ కోడ్ బిల్లును వ్యతిరేకించాలని ముస్లింలకు అండగా నిలబడాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ఖచ్చితంగా చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని తెలిపినట్లు ఆయన అన్నారు. ముస్లింల సమస్యల గురించి దేశవ్యాప్తంగా చర్చించాలన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన చంద్రబాబు ముస్లింలకు తోడుగా ఉంటానని హామీ ఇచ్చినట్లు ముక్తియార్ తెలిపారు. అనంతరం సామూహిక దువా చేశామన్నారు.


దువా కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలు

నత్తనడకన రోడ్డు విస్తరణ పనులు

పరిహారం మంజూరులో జాప్యమే కారణం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గ్రామం 5 మండలాలకు కూడలిగా ఉండడంతో రూ.140 కోట్లతో నిర్మించ తలపెట్టిన రోడ్లు, భవనాల శాఖ విస్తరణ పనులు నిర్లక్ష్యంగా జరుగుతున్నాయి. రోడ్ల విస్తరణ కింద భవనాలు, దుకాణాలు, స్థలాలు కోల్పోయిన బాధితులకు పరిహారం మంజూరులో జాప్యం జరుగుతుండడంతో ఈ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. పరిహారం పొందినవారు తమ భవనాల ముందు భాగాలను తొలగిస్తుండగా, పరిహారం అందని వారు ఇప్పటికీ తమ దుకాణల గదులను మార్కింగ్ మేర తొలగించడం లేదు. దీంతో విస్తరణ పనులు నాలుగు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కు అన్న చందంగా తయారైంది. వేంపల్లెలో దాదాపు 60 వేలకు పైగా జనాభా ఉంది. వేంపల్లె మీదుగా కడప-పులివెందుల రోడ్డు, వేంపల్లె-గండి మార్గాలున్నాయి. ప్రతి రోజు ఈ రోడ్లల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ, గండి పుణ్యక్షేత్రం ఈ మార్గాలల్లోనే ఉన్నాయి. మరోవైపు ఎర్రగుంట్ల నుంచి రోజూ సిమెంట్ లోడుతో లారీలు వేంపల్లె మీదుగానే చెన్నై, బెంగళూరు వెళ్తుంటాయి. దీంతో ఈ రెండు మార్గాల్లో వాహనాల రద్దీ అధికమై గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, భవిష్యత్తులో పట్టణాభివృద్ధి దృష్ట్యా కడప-పులివెందుల, వేంపల్లె-రాయచోటి రెండు రోడ్లను 80 అడుగుల మేర విస్తరించాలని జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, సర్పంచి రాచినేని శ్రీనివాసులు, ఎంపీ అవినాష్‌రెడ్డి, ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రెండు ప్రధాన రహదార్లలో స్థలాల విలువ ఎక్కువగా ఉందని 80 అడుగుల మేర రోడ్లు విస్తరిస్తే తమ దుకాణాలు చిన్నవై పోతాయని ఈ రెండు రోడ్లకు ఇరువైపులా ఉన్న బాధితులు ఎంపీని కలిసి విన్నవించారు. రెండు రోడ్లకు ఇరువైపులా ఉన్న దుకాణాలను పరిశీలించి 72 అడుగుల మేర రోడ్లను విస్తరించాలని నిర్ణయించారు. ఈ రెండు రోడ్ల కింద స్థలాలు కోల్పోయే బాధితులకు పరిహారం, రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా రూ.140 కోట్లు మంజూరు చేయించారు. వేంపల్లెలోని కడప-పులివెందుల రోడ్డు విస్తరణ కోసం రూ.47 కోట్లు, వేంపల్లె-రాయచోటి రోడ్డు విస్తరణకు రూ.13 కోట్లు మంజూరైంది. ఈ రోడ్ల కింద స్థలాలు, గదులు కోల్పోయే వారికి రూ.80 కోట్ల పరిహారం మంజూరైంది. ఇందులో రెండు విడతలుగా బాధితులకు రూ.68 కోట్లు వారి ఖాతాల్లో పరిహారం కింద జమ చేశారు. ఈ రెండు రోడ్ల కింద 48 మంది బాధితులతోపాటు ట్రాన్స్ కో, పోలీస్, ప్రభుత్వ ఆసుపత్రి, వృషభాచలేశ్వర దేవస్థానం, జిల్లా పరిషత్తులకు చెందిన దుకాణ సముదాయాలకు సంబంధించి రూ.14 కోట్ల పరిహారం రావాల్సి ఉంది. అందరికీ పరిహారం అందించిన తర్వాతే విస్తరణ పనులను త్వరితగతిన చేపడుతామని రోడ్డు భవనాల శాఖ అధికారులు అంటున్నారు.


పరిహారం అందక ఇళ్లను తొలగించని యజమానులు

నష్టపరిహారం అందలేదు

కడప-పులివెందుల రోడ్డు విస్తరణ కింద ఇల్లు పది అడుగుల మేరకు పోతుంది. చుట్టుపక్కల పలువురికి నష్టపరిహారం మంజూరైంది. నాకు మాత్రం అందలేదు. నష్టపరిహారం అందిన వెంటనే ఇంటి గోడలను తొలగిస్తాను.

- సున్నా, వేంపల్లె

పరిహారం మంజూరు కాక పనులు చేపట్టలేదు

రోడ్డు విస్తరణలో భాగంగా ఇంట్లోని ఒక గది కోల్పోతున్నాను. ఇప్పటికీ అధికారులు పరిహారం మంజూరు చేయలేదు. పరిహారం మంజూరు చేయక పోవడంతో మరమ్మతు పనులు చేపట్టలేదు. ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలి.

- మున్నా, వేంపల్లె

గూగుల్ పరిధిలోకి విద్యుత్ సర్వీసులు

మొదటగా వ్యవసాయ సర్వీసులకు మ్యాపింగ్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

వినియోగదారులకు మరింత మెరుగైన విద్యుత్ అందించేందుకు ఎపి ఎస్‌పిడిసిఎల్ కసరత్తు చేస్తుంది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలోని వ్యవసాయ సర్వీసులకు సంబంధించి హెచ్‌టి, ఎల్‌టి లైన్లతోపాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని గూగుల్ పరిధిలోకి ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేస్తున్నారు. పులివెందుల విద్యుత్ శాఖ డివిజన్ పరిధిలోని పులివెందుల, లింగాల, సింహాద్రిపురం, తొండూరు, వేముల, వేంపల్లి, చక్రాయపేట మండలాల్లో దాదాపు 32వేల వ్యవసాయ సర్వీసులు ఉన్నాయి. ఈ సర్వీసులకు సంబంధించి విద్యుత్ శాఖ సిబ్బంది క్యూఆర్ కోడ్‌తో ఉన్న రెండు స్టిక్కర్లను అతికిస్తున్నారు. ఈ మ్యాపింగ్ పూర్తయితే విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన విద్యుత్ అందించేందుకు వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. తద్వారా రైతులు తమ సర్వీస్ నెంబర్ గూగుల్‌తో అనుసంధానం చేసిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేసినట్లయితే పూర్తి సమాచారం లభిస్తుంది. అంతేకాక నేరుగా వెళ్లే వెసులుబాటు ఉంటుంది. దీంతోపాటు ఏదైనా విద్యుత్ మరమ్మతుకు గురైనట్లయితే అక్కడికి సర్వీస్ నెంబర్ నమోదు చేయగానే గూగుల్ మ్యాప్ ద్వారా సులభంగా వెళ్లే అవకాశం ఉంటుంది. ఈ విషయమై విద్యుత్ శాఖ పులివెందుల అర్బన్ ఎడిఇ శ్రీకాంత్‌ను అడగ్గా ప్రస్తుతం వ్యవసాయ సర్వీసులను చేస్తున్నామని, త్వరలోనే అన్ని సర్వీసులను మ్యాపింగ్ చేస్తామన్నారు. దీని ద్వారా మరింత మెరుగైన విద్యుత్తు అందించనున్నట్లు ఆయన వివరించారు.


టాన్స్‌ఫార్మర్ వద్ద మ్యాపింగ్ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

24న ప్రొద్దుటూరులో బిఎస్‌పి సమావేశం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఈ నెల 24న ప్రొద్దుటూరులో జరుగు బిఎస్‌పి క్యాడర్ క్యాంపును విజయవంతం చేయలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబయ్య కోరారు. స్థానిక బిఎస్‌పి కార్యాలయంలో జిల్లా ఇన్‌ఛార్జి పన్నీటి బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిసెనపల్లి ఓబయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బడుగు బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందన్నారు. బహుజనులమైన మనందరం కలిసి బహుజన రాజ్యాన్ని స్థాపించుకుంటే తప్ప, బహుజనులకు న్యాయం జరగదన్నారు. బహుజనులు అందరూ కలిసి రాబోయే ఎన్నికల్లో బిఎస్‌పిని ఆదరించాలన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అసెంబ్లీ, మండల, మున్సిపాలిటీ కమిటీలను పూర్తి చేసుకొని ఈనెల 24న జరిగే రాజకీయ శిక్షణ తరగతులు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు నియోజకవర్గం బిఎస్‌పి అధ్యక్షులు టి.కమల్‌బాషా, నియోజకవర్గ కన్వీనర్లు, కమిటీ సభ్యులు మురళీకృష్ణ, వెంకటనారాయణ, రమేష్, ఆనంద్, సీతారామయ్య, మహమ్మద్, పెంచలయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి పి.బాబు

పెన్నా, కుందూ పరిధిలో వరి సాగు జోరు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో కుందూ, పెన్నా నది పరివాహక బోరుబావుల కింద ఖరీఫ్‌లో వరి పంట సాగుకు రైతులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వరి నారు కయ్యలు తయారు చేస్తూ, విత్తనాలు చల్లుతున్నారు. గాలి అధికంగా వీస్తుండడంతో వరి నారు వేసిన తర్వాత ఇసుక చల్లుతున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లో మండల పరిధిలో 14 వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. సాగు చేసిన వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతులు గతంలో ఎన్నడూ లేనివిధంగా లబ్ధి పొందారు. దీంతో రెండవసారి వరి పంట సాగు చేసిన తర్వాత ధరలు పెరగడంతో రైతులు సంతోష పడ్డారు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ఇప్పటికే వరి నారు సాగు చేసి దుక్కిళ్ళ చేపడుతున్నారు. ప్రస్తుతం మండల పరిధిలో నాగులపల్లె, చాపాడు, సీతారామపురం, అనంతపురం, రాజువారిపేట, అయ్యవారిపల్లె, తిమ్మాయపల్లె తదితర గ్రామాల పరిధిలో వరి పంట సాగుకు ప్రయత్నాలు చేస్తున్నారు.


తిమ్మాయపల్లె వద్ద వరి నారు చల్లుతున్న రైతు

మైదుకూరు అభివృద్ధికి 'పుట్టా' చేసింది శూన్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు అభివృద్ధికి పుట్టా సుధాకర్ యాదవ్ చేసింది శూన్యమని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి విమర్శించారు. పుట్టా సుధాకర్ యాదవ్ మంగళవారం దువ్వూరు బస్సు యాత్రలో రూ.950 కోట్లతో అభివృద్ధి చేశానని పేర్కొనడంపై బుధవారం ఎమ్మెల్యే స్పందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమావాస్యకో, పౌర్ణమికో మైదుకూరు వచ్చి అభివృద్ధిపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రూ.950 కోట్లు అభివృద్ధి ఎక్కడ దాచావు.. నీరు-చెట్టు లోనా అని ఎద్దేవా చేశారు. రూ.950 కోట్ల అభివృద్ధి మైదుకూరు మున్సిపాలిటీలో ఎక్కడా కనబడలేదన్నారు. ఎమ్మెల్యేగా తాను మున్సిపాలిటీకి చేసిన రూ.100 కోట్ల అభివృద్ధిని చూపిస్తా అని సవాల్ విసిరారు. టిడిపి ప్రభుత్వంలో అవినీతి అధికారులను పెంచి పోషించారని పేర్కొన్నారు. తాను అవినీతి చేశాను అని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమన్నారు. మీ ప్రభుత్వంలో చేసిన అవినీతిని నిరూపించడానికి సిద్ధమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, వైస్ చైర్మన్ షరీఫ్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీమణ్‌నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు స్వచ్ఛభారత్ ఎంసిఒలు సన్మానం

స్వచ్ఛభారత్ కార్యక్రమంలో నూతనంగా నియమించిన ఎంసిఒలు బుధవారం మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డిని సన్మానించారు. గత ప్రభుత్వంలో సాక్షర భారత్ కో-ఆర్డినేటర్‌గా ఉన్న వారిని వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మళ్లీ విధుల్లోకి తీసుకున్నందుకు వారు కృతజ్ఞతగా ఎమ్మెల్యేను సన్మానించారు. చాపాడు ఎంసిఒ డి.వెంకటసుబ్బారెడ్డి, మైదుకూరు ఎంసిఒ అన్వర్‌బాషా, ఖాజీపేట ఎంసిఒ ఉమాదేవి, దువ్వూరు ఎంసిఒ ప్రసాద్ పాల్గొన్నారు.

'ఇండియా' కూటమి విజయం తథ్యం : పిసిసి

వేంపల్లె : రాబోవు సార్వత్రిక, లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కుటమి విజయం తథ్యమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బెంగళూరులో జరిగిన ఇండియా కుటమి పార్టీల సమావేశం ఉత్సహ భరితంగా జరిగిందన్నారు. ఇండియా కుటమిలోని పార్టీలన్నీ బలమైన పార్టీలన్నారు. ఎన్‌డిఎ కుటమిలో బిజెపి తప్ప బలమైన పార్టీలు లేవన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చి దాదాపు పదేళ్లు అయిందన్నారు. వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నట్లు చెప్పారు. మోడీ ప్రభుత్వం రూ.109 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. ఐటిసి లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతున్నారని తెలిపారు. బిజెపితో జనసేన పార్టీ జత కట్టడం శోచనీయమన్నారు.

ఓటు హక్కు ఉందోలేదో చూసుకోవాలి

ప్రజాశక్తి - దువ్వూరు

బిఎల్‌ఒలు గ్రామాల్లో సర్వేకు వచ్చినప్పుడు తమ ఓటుహక్కు ఉందోలేదో సరి చూసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు ప్రజలకు సూచించారు. స్థానిక ఎండిపిఒ కార్యాలయంలో బుధవారం ఆయన బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపై బిఎల్‌ఒకు అవగాహన కల్పించారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమాకుమారి, డిటి నారాయణస్వామి, ఆర్‌ఐ జాన్సన్, సూపర్‌వైజర్లు, బిఎస్‌ఒలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఉచిత సేవలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలు ప్రభుత్వ పథకాలకు సంబంధించి అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా పొందవచ్చునని, ఆ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ సుమి త్రమ్మ, మండల వైసిపి నాయకులు ఇరగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. రహమత్‌ఖాన్‌పల్లె గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సుబ్బారెడ్డి, సచివాలయ కార్యదర్శి శ్రీనివాసులు, వాలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


పత్రాలను అందజేస్తున్న వైసిపి నాయకులు నాగేశ్వర్‌రెడ్డి

పెద్దముడియం : ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి అధికారుల సమక్షంలో సభ ఏర్పాటు చేశామని ఎంపిడిఒ వెంకటరమణయ్య తెలిపారు. మండల కేంద్రమైన పెద్దముడియంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల అవసరాల మేరకు పత్రాలు పంపిణీ చేశారు. తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఇఒపిఆర్‌డి రఘునాథ్, సర్పంచు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని పురపాలక ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్ రెడ్డి, పురపాలక చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని రాజీవ్‌కాలనీ వార్డులోని సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలకు 923 వివిధ కుల, ఆదాయ, వివాహ, ఇతర 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి, పురపాలక వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు ఉన్నారు

చాపాడు : జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగమని తహశీల్దార్ సుభాని తెలిపారు. వెదురూరులో జగనన్న సురక్ష గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందుతున్నాయన్నారు. అన్ని గ్రామాల్లో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సచివాలయాల కన్వీనర్ల మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, ఎఒ రామాంజనేయులు, సర్పంచు లలితమ్మ, మాజీ ఎంపిటిసి ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

కలసపాడు : వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వాలంటీర్లదే కీలకమని జెసిఎస్ మండల కన్వీనర్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. లింగారెడ్డిపల్లెలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లింగా రెడ్డి పల్లె సచివాలయంలో దాదాపు 220 దర ఖాస్తులు రాగా వాటిలో 212 పూర్తి చేశామన్నారు. జడ్‌పిటిసి అంకన గురివిరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను దాదాపు 98 శాతం పూర్తి చేశారన్నారు. సర్పంచు పుల్లెం గుర్రమ్మ మాట్లాడుతూ ఇంతవరకు చేసిన పనులకు రావలసిన బిల్లులు ఇంకను రాలేదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులైన త్వరగా వచ్చేందుకు తగిన చర్యలు అధికారులు తీసుకోవాలని, సచివాలయాన్ని ముందుకు నడిపించుకుని పోవాలంటే కొంత ఖర్చుతో కూడుకున్న పని అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సగిలి సుదర్శన్, స్పెషల్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపిపి సుధా రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ రవీంద్రారెడ్డి, ఎంపిడిఒ మహబూబ్బి, ఎంపిటిసి సగిలి రమేష్, మాజీ సింగల్ విండో అధ్యక్షులు బోవిల్లా ఓబుల్‌రెడ్డి, మాజీ సర్పంచులు బాల వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి, వైసిపి నాయకులు పుల్లెం నారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్‌పిటిసి అంకన గురివిరెడ్డి

వేంపల్లెను అభివృద్ధి పథంలో నడిపిస్తాం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తామని పులివెందుల ఒఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం పాడాకు చెందిన రూ.28.3 లక్షలతో నిర్మించిన నూతన అదనపు భవనాలను ఒఎస్‌డి, ఆర్‌డిఒ వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లె మండల అభివృద్ధికి సిఎం జగన్ కోట్లాది రూపాయలు మంజూరు చేశారన్నారు. రెవెన్యూ కార్యాలయాన్ని ఆధునీకరణ చేశామన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన పనులను ఒఎస్‌డి తనిఖీ చేసి నాణ్యతగా పని చేయాలని కాంట్రాక్టరును ఆదేశించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, సర్పంచ్ శ్రీనివాసులు తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్వేయర్ శివారెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, పంచాయతీ రాజ్ డిఇ రవిచంద్రారెడ్డి, రోడ్డు భవనాల శాఖ ఇఇ సిద్దారెడ్డి, మండల అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


అదనపు భవనాలను ప్రారంభిస్తున్న ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

కొండాపురం : శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని నూతనంగా కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐలుగా బాధ్యతలు స్వీకరించిన యోగేంద్ర, మోహన్ తెలిపారు. బదిలీల్లో భాగంగా కొండాపురం ఎస్ఐగా కడప ఇంటెలిజెన్సీ విభాగంలో పనిచేస్తున్న యోగేంద్ర మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐగా మోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కి చెందిన మోహన్ కడప స్పెషల్ బ్రాంచ్ నుండి ఇక్కడికి బదిలీపై వచ్చారు. తాళ్ళప్రొద్దుటూరు ఎస్ఐ రవికుమార్ కడప ఎస్‌పి కార్యాలయానికి బదిలీ అయ్యారు.


తాళ్ళప్రొద్దుటూరు ఎస్ఐ మోహన్